# ఓడిపోలేదు

ఆనందరావు ఆఫీసునుంచి వచ్చీ రాంగానే "మరొక యిల్లు ఎక్కడైనా చూడండి. ఈ యింట్లో నేనుండలేను" అన్నది విమల.

"ఏం ఈ యింట్లో భూతాలున్నాయా?" అన్నాడు ఆనందరావు.

"భూతాలంటే నాకు భయంలేదు. మనుషులంటేనే చచ్చేంత భయం" అన్నది విమల.

"ఏ మనుషులు?" అన్నాడు ఆనందరావు.

"ఆ వివరాలన్నీ ఎందుకు? చెప్పినట్టు చేస్తారా చెయ్యరా?" అన్నది విగ్గతిసి.

"ఈ ఇల్లు ఎందుకు వదలాలంటున్నావో నాకు అర్థం కావడంలేదు. అసలే ఈ వూళ్ళో అద్దె యిళ్ళకు యమ యాతనగా వుంది. ఉద్యోగమన్నా సంపాదించుకోవచ్చునేమో గాని అద్దె యిల్లు సంపాదించడం మట్టుకు సాధ్యంకాదు. లక్షణంగా వున్న యిల్లు, ఆ మాటకొస్తే మనకి అచ్చివచ్చిన యిల్లు కూడాను. ఇక్కడికి వచ్చాకనే ఇద్దరికి తోడు మరో యిద్దర్ని బిడ్డల్ని కన్నావు. నాకు రెండు ఇంక్రిమెంట్లు వచ్చాయి" అన్నాడు ఆనందరావు నవ్వుతూ.

"మీకు ఏం చెప్పినా తమాషాగానే వుంటుంది" అన్నది విమల మూతి విరిచి.

"ప్రతిదాన్ని సీరియస్‌గా తీసుకుంటే మనం బ్రతకగలమా?"

"అదికాదండీ ఇరుగూ పొరుగూ కొత్తవాళ్ళు వచ్చారు. వాళ్ళేమో బాగా వున్నవాళ్ళు. వాళ్ళ మధ్య వుండటం ముళ్ళ మీదున్నట్టుంటుంది. మీరు చెబితే వినిపించుకోరు నా అవస్థ మీకు తెలీదు" అన్నది విమల బాధగా.

"బాగానేవుంది. ఈ యిల్లు విడిచి మరొక చోటికివెళ్తే ఇట్లాంటి వారు అక్కడమాత్రం తగలరని నమ్మకమేమిటి ?" అన్నాడు ఆనంద రావు.

"మీరు అన్నిటికీ అన్నీ చెబుతారు. ఇక నేనేం మాట్లాడేది ?"

"ఏం మాట్లాడనవసరంలేదు. పారిపోయి దేన్నించీ తప్పించు కోలేం. దేన్నయినా ధైర్యంగా ఎదుర్కోవడం నేర్చుకోవాలి" అన్నాడు ఆనందరావు.

"చెప్పడం సులభం" అన్నది విమల.

ఆత్మవిశ్వాసం వుంటేచెయ్యడం కూడా సులభమేనని చెప్పాలను కున్నాడు. కాని ఆనందరావు చెప్పలేదు. ఆడవాళ్ళతో వాదించి లాభంలేదు తమకున్న బలహీనతల్ని వాళ్ళుఅందరిలోనూ చూస్తారు—పరువుప్రతిష్ఠల్ని డబ్బు, హోదా వీటితోకలిపి చూడటం తప్ప విడిగా చూశ్కెరు. డబ్బు హోదాలేనంతమాత్రాన మనిషిఎందుకు కుంచించుకపోవాలో ఆనందరావుకు అర్థంకాలేదు. డబ్బూ హోదావున్న వాళ్ళని చూచి భయపడటం ఎందుకో అంతకన్నా అర్థంకాలేదు.

నిజానికి విమల ఈ యిల్లు ఎందుకు వదలాలను కుంటున్నదో ఆనందరావుకు తెలుసు, ఈమధ్యనే ఇరుగూ పొరుగూ కొత్తవాళ్ళు వచ్చి చేరారు. ఆ వచ్చినవాళ్ళు కొస్త కలిగిన వాళ్ళని కూడా ఆనందరావుకు తెలుసు. వాళ్ళయినా విమలని బెదరగొట్టలేదు. తన నీడను చూచి తానే బెదురుకుంటున్నది, ఆ విషయం తను గమనించాడు. వారం క్రిందట పక్కింటామె వచ్చింది.

ఆమె భర్తకి ఏదో పెద్ద ఉద్యోగమే. అయినా ఆమెలో అహం కారంలాటి అవగుణాలేవీ వున్నట్టులేవు. తనంతట తానేవచ్చింది. "వచ్చీ రాంగానే ఏం చేస్తున్నారమ్మా" అంది.

"వంటయిపోయింది. ఏంతోచక వూరికే కూర్చున్నాను. రండి" అని విమల ఆహ్వానించింది.

"బాగుంది. ఏంచేశారు వంట ?" అంది యథాలాపంగా.

"పప్పు, తాళింపు పచ్చడీ...."

విమల చదువుతోన్న దండకం వింటుంటే ఆనందరావుకి నవ్వు వచ్చింది. తాళింపులూ పచ్చళ్ళూ, తనజీవితంనుంచి ఎప్పుడో తప్పుకున్నాయి. తప్పుకున్నవి మాటల్లో దొర్లుతున్నాయి.

పైస్థాయి వాడితో తక్కువస్థాయివాడు పోటీపడబోతే అబద్దాలూ, ఆడంబరాలూ తప్పవు. ఆవిడ అర్థగంటసేపుంది. అర్థగంటలో విమలచేత అరడజను అబద్దాలు చెప్పించింది. విమల దృష్టిలో అవన్నీకూడా ప్రతిష్ఠను కాపాడే అబద్దాలు.

అంతా ఆనందరావు విన్నాడుగాని "ఇట్లా అబద్దాలు చెప్పవలసిన అవసరం ఏముంది?" అని విమలతో అనలేదు. అంటే పట్టుబడ్డ దొంగలా బాధపడుతుంది. వున్నవిషయాలని కప్పిపుచ్చుకోవటానికి అబద్దాలు చెప్పడమనేదే బాధాకరమైన విషయం. అవి బయటపడటం – ఎవరి ముందయినా సరే – మరీ బాధకలిగిస్తుంది. అందుకని విననట్టే గమ్మున వున్నాడు. ఎటూ ఈరోజు యింటి ప్రసక్తి వచ్చిందిగనుక, విమలతో కొన్ని విషయాలు చెప్పడం మేలేమో ననిపించింది ఆనందరావుకు.

"విమలా ఒక విషయం చెప్పనా ? అన్నాడు ఆనందరావు.

"చెప్పండి" అన్నది విమల.

"దరిద్రం అనుభవించడంలో బాధ వుంది. ఒప్పుకుంటాను. కానీ, దాన్ని దాచాలనిచేసే ప్రయత్నం వుందే – అది ఇంకా బాధాకరమైంది, హేయమైంది" అన్నాడు.

ఆనందరావు దేని విషయం ప్రస్తావిస్తున్నాడో, తెలుసుకోగల ఇంగితం విమలకుంది. ఆమె ఏ సమాధానం చెప్పలేదుకాని ఒక నిట్టూర్పు విడిచి వూరుకుంది. ఆ తర్వాత విమల ఇంటి విషయం ఎత్తలేదు.

వారం రోజుల తర్వాత ఒక ఆదివారం ఆనందరావు ఇంట్లోనే వున్నాడు. పక్కింటావిడ వచ్చింది. వాళ్ళ సంభాషణని ఆనందరావు వింటానే వున్నాడు.

"మీ ఆయన ఉదయం యేదో బట్టల పాకెట్ తెచ్చినట్టుంది. కొత్తబట్టలు కొన్నారేమిటి ?" అంది ఆమె.

"అబ్బే అదేంలేదు. లాండ్రీనుంచి బట్టలు తెచ్చివుంటారు" అంటోంది విమల.

"లాండ్రీవా ? చాకలి వాడేమయ్యాడు ?" అంది ఆమె.

"ఏమన్నా కావడానికి చాకలి వాడంటూ ఒకడుంటేనా ?" ఆయన కున్నవి రెండు జతలు. ఒకటి ఒంటిమీదుంటే రెండోది లాండ్రీలో వుంటుంది. చాకలాడికి వేసేవాడు వారం రోజు లుంచుతాడు. ఎట్లా కుదురుతుంది ? నావి పిల్లలివి నేనే ఉతుక్కుంటాను" అన్నది విమల.

"పోనీలెండి ఎవరి పని వాళ్ల చేసుకుంటే తప్పేముంది" ? అన్నది సమర్థిస్తూ పక్కింటావిడ.

"తప్పు ఒప్పుల సమస్యకాదు. అంతకన్నా గత్యంతరంలేదు మరి" అన్నది విమల.

"అన్నట్టు మీ అబ్బాయికి జ్వరమని విన్నాను. డాక్టరుతో మందో మాకో ఏమైనా యిప్పిస్తున్నారా ?"

"లేదండీ" అన్నది విమల.

"చీటికీ మాటికీ ఈ అలోపతి మందులు వాడితే రియాక్షనిచ్చి లేని జబ్బులు వస్తాయని మా ఆయన అంటూంటారు. వట్టిజ్వరమేగా రెండు రోజులుంటే అదే పోతుందిలెండి" "ఆలోపతి మందులు రియాక్షనిచ్చేట్టయితే హోమియోపతి మందులు వాడచ్చు విషయం అదికాదులెండి. నెలాఖరు. డబ్బుల్లేవు" అంది విమల.

ఇట్లా నడిచింది సంభాషణ. విమల ఏమీ దాచలేదు. కనీసం సమర్థించడానికైనా ప్రయత్నించలేదు. కాసేపుండి పక్కింటావిడ వెళ్ళాక ఆనందరావు విమల దగ్గరికి వచ్చేడు.

విమల కళ్ళలో నీళ్ల పారాడుతున్నాయి!

కన్నీళ్లెందుకు విమలా; నువ్వు ఓడిపోలేదు. విజయంసాధించావు. నాకు చాలా సంతోషంగా వుంది" అంటూ ఆనందరావు విమలను దగ్గరికి తీసుకున్నాడు;